సాక్షి
అనంతపురం
మంగళవారం । 7 । జనవరి । 2025



చీనీ టన్ను రూ.26 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.26 వేలు పలికాయి.



రెండు గ్రామాలు..ఓ దేవర దున్న

ఓ దేవర దున్నపోతు పంచాయితీ రెండు గ్రామాల మధ్య ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసుల జోక్యంతో సోమవారం ఈ వివాదానికి తెర పడింది. 8లో

గరిష్టం/కనిష్టం
33.8°/10.7°

జిల్లా అంతటా సోమవారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

రూసా ల్యాబ్ ప్రారంభం



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎస్కేయూ రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు

అనంతపురం: ఎస్కేయూ క్యాంపస్ ఫిజిక్స్ విభాగంలో రూసా (రాష్ట్రీయ ఉచ్ఛతార్ శిక్షా అభియాన్) పథకం కింద రూ.2 కోట్లతో నిర్మించిన ల్యాబ్‌ను సోమవారం ప్రారంభించారు. 200 కంప్యూటర్లతో రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులకు ఉపయోగపడే రీతిలో నిర్మించేందుకు గత ప్రభుత్వంలో నిధులు విడుదలయ్యాయి. పనులు పూర్తవడంతో ఎస్కేయూ రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు ల్యాబ్‌ను ప్రారంభించారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు విద్యార్థులకు ల్యాబ్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. రామచంద్ర, సీడీసీ డీన్ ప్రొఫెసర్ కే. రామ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ఫలితాల విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం: ఎంబీఏ, ఎంసీఏ ఫలితాలను జేఎన్‌టీయూ(ఏ) ఉన్నతాధికారులు విడుదల చేశారు. నవంబర్, డిసెంబర్‌లో నిర్వహించిన ఎంబీఏ, ఎంసీఏ మూడో సెమిస్టర్ (ఆర్-21) రెగ్యులర్, సప్లిమెంటరీ, నాలుగో సెమిస్టర్ సప్లిమెంటరీ, ఎంసీఏ ఐదో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ వి. నాగప్రసాద్ నాయుడు సోమవారం విడుదల చేశారు. ఫలితాలకు జేఎన్‌టీయూ(ఏ) వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఏపీ శివకుమార్, అడిషనల్ కంట్రోలర్స్ ప్రొఫెసర్ రాజు, డాక్టర్ ఎం. అంకారావు, డాక్టర్ ఎస్.శ్రీధర్ పాల్గొన్నారు.

మాజీ సైనికుడి ఆత్మహత్య



మృతి చెందిన సంతోష్‌కుమార్

బుక్కరాయసముద్రం: బావిలో పడి మాజీ సైనిక ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని వడియంపేటలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం మారుతీ నగర్ 4వ క్రాస్‌లో నివాసం ఉంటున్న సంతోష్ కుమార్-43 సీఐఎస్ఎఫ్‌లో ఉద్యోగం చేసేవారు. ఇతనికి ఇద్దరు భార్యలు. కుటుంబ తగాదాల నేపథ్యంలో భార్యలు సీఐఎస్ఎఫ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా.. ఇటీవల ఉద్యోగం నుంచి తొలగించారు. దీంతో ఆర్థిక ఇబ్బందులు పెరిగిపోయాయి. మనస్తాపం చెందిన సంతోష్‌కుమార్ వడియంపేట సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో పడి సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి సీఐ కరుణాకర్ చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అనంతపురంలోని టవర్‌క్లాక్ సమీపంలో ఉన్న షిర్డీ సాయి స్వీట్స్ దుకాణంలో మూడు నెలల క్రితం ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. దుకాణంలో ఆహార పదార్థాలను పరిశీలించారు. నెయ్యి, ఐస్‌క్రీమ్ బర్ఫీలు నాసిరకంగా ఉన్నట్లు తేల్చారు. దుకాణ నిర్వాహకులకు జరిమానా విధించారు.

అనంతపురంలోని బెంగళూరు అయ్యంగార్ బేకరీలో నెల క్రితం అధికారులు తనిఖీలు చేపట్టారు. కాలం చెల్లిన ఆహార పదార్థాలను వినియోగదారులకు విక్రయిస్తున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. నమూనాలను సేకరించి ల్యాబుకు పంపారు. వాస్తవమని తేలితే రూ. లక్ష వరకూ పెనాల్టీ విధించే అవకాశం ఉంది.

నెల క్రితం అనంతపురంలోని ఎస్ఎస్ ప్యాలెస్ హోటల్ కెళ్లిన ముగ్గురు స్నేహితులు చేపల కర్రీ ఆర్డర్ చేశారు. సిబ్బంది వడ్డించిన కర్రీ నాణ్యతగా లేకపోవడంతో నిర్వాహకులను ప్రశ్నించారు. వారు నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో ఆహార భద్రతా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు నమూనాలు తీసి ల్యాబుకు పంపించారు. ఈ మూడు చోట్లే కాదు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఇదే దుస్థితి.

కలర్ ఫుల్లు ఆరోగ్యానికి చిల్లు



- దడ పుట్టిస్తున్న బేకరీలు, హోటళ్ల నిర్వాహకులు
- ఆహా అనిపిస్తూనే చుక్కలు చూపిస్తున్న వైనం
- వారాల తరబడి ఆహార పదార్థాల నిల్వ
- నాణ్యతలేని పదార్థాలతో వంటకాలు
- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లాలో హోటళ్లు, బేకరీల నిర్వాహకుల ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. నాసిరకం నూనెల వాడకం మొదలు మాంసాహారాన్ని వారాల తరబడి నిల్వ ఉంచుతున్నారు. దాన్నే ఆహార ప్రియులకు వడ్డిస్తూ ఆస్పత్రుల పాల్జేస్తున్నారు. రోజూ ఏదో ఒక చోట ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతుండటం ఆందోళనకు గురిచేస్తోంది.

రోజుల తరబడి నిల్వ..

అనంతపురం, గుంతకల్లు, గుత్తి, కళ్యాణదుర్గం, కదిరి, ధర్మవరం తదితర ప్రాంతాల్లో ఎక్కువ సంఖ్యలో బేకరీలు, హోటళ్లు ఉన్నాయి. వీటిలో అమ్మకాలకు ఉంచుతున్న ఆహారంపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా వెజ్ పఫ్‌లు, ఎగ్‌పఫ్‌లు రోజుల తరబడి నిల్వ ఉంచుతున్నారు. ఈ క్రమంలో బూజు పట్టినా కస్టమర్లకు అప్పటికప్పుడు ఓవెన్‌లో వేడిచేసి ఇస్తున్నారు. ఆ పదార్థం తిన్నవారు ఫుడ్‌పాయిజన్‌తో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు ఎక్కువకాలం నిల్వ ఉంచిన ఐస్‌క్రీంలు, కేక్‌లు తిని అనారోగ్యం బారిన పడుతున్నారు.



ఇటీవల తనిఖీల్లో గుర్తించిన ఫ్రిజ్‌లో ఉంచిన చికెన్

కఠిన శిక్షలు లేకే..

ఇటీవల అనంతపురంలోని వివిధ బేకరీలు, హోటళ్లలో అధికారులు నిర్వహించిన తనిఖీల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. నగరంలోని అలెగ్జాండర్ హోటల్‌లో చికెన్ లాలీపప్‌పై ప్రమాదకర రంగులు చల్లినట్టు గుర్తించి కేసు నమోదు చేశారు. బెంగుళూరు హైవేలోని పాకశాల, తాడిపత్రి బిరియాని హోటళ్లలో అత్యంత అపరిశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాలు వండుతున్నట్లు పరిశీలనలో వెల్లడైంది. స్వగృహ స్వీట్స్ దుకాణంలో కొన్ని ఆహార పదార్థాల నమూనాలు సేకరించారు. ఇంకా రిపోర్టులు రావాల్సి ఉంది. అయితే, జరిమానాలు విధిస్తున్నా నిర్వాహకులు దారికి రాకపోవడం గమనార్హం. ఆహార భద్రతా చట్టం పరిధిలో కఠిన శిక్షలు లేకపోవడంతో బరితెగిస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు హోటళ్ల యజమానులైతే రాజకీయ నాయకులకు ఫోన్ చేసి తమపై ఈగ కూడా వాలకుండా చేసుకుంటుండటం గమనార్హం.

నాణ్యత లోపిస్తే చర్యలు

హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీల్లో నాసిరకం ఆహార పదార్థాలు అందించినా, పారిశుధ్యం లోపించినా కఠిన చర్యలు తీసుకుంటాం. తనిఖీలు ముమ్మరం చేశాం. కేసును బట్టి పెనాల్టీలు విధిస్తున్నాం. ఎంత పెద్ద హోటల్లో అయినా నాణ్యత లోపిస్తే చర్యలకు వెనుకాడబోం.

–తస్లీమా, ఫుడ్ ఇన్‌స్పెక్టర్

అనంతపురం జిల్లాలో హోటళ్లు	550 పైనే
లైసెన్సుతో నడుస్తున్న హోటళ్లు	200 లోపు
శ్రీ సత్యసాయి జిల్లాలో హోటళ్లు	300 పైనే
లైసెన్సుతో నడుస్తున్నవి	150 లోపు
రెండు జిల్లాల్లో బేకరీలు	140 వరకు

దుర్గమ్మ విగ్రహం లభ్యం

శింగనమల: దుండగులు అపహరించుకెళ్లిన దుర్గమ్మ పంచలోహ విగ్రహం లభ్యమైంది. సోమవారం ఆలయ సమీపంలో వరి పొలాల్లో దుర్గమ్మ పంచలోహ విగ్రహాన్ని గుర్తించిన స్థానిక రైతుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. విగ్రహాన్ని, అమ్మవారి వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 3న శింగనమల చెరువు కట్ట వద్ద ఉన్న దుర్గాంజనేయ స్వామి ఆలయం, దుర్గమ్మ ఆలయంలో దుండగులు చొరబడి 4 కిలోల వెండి కవచాలు, పంచలోహ విగ్రహాన్ని అపహరించిన విషయం తెలిసిందే. కాగా, దుర్గమ్మ ఆలయంలో చోరీ చేసిన సొత్తు లభ్యం కాగా, దుర్గాంజనేయస్వామి ఆలయంలో చోరీ చేసిన 4 కిలోల వెండి కవచాలు లభ్యం కావాల్సి ఉంది.

జీసీటీఏ జిల్లా నూతన కార్యవర్గం

- అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా మనోహర్‌రెడ్డి



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపక సంఘం (జీసీటీఏ) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సోమవారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కమిటీని కొత్తగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ కే. లక్ష్మీనారాయణ (రాయదుర్గం), కార్యదర్శిగా డాక్టర్ బి.మనోహర్ రెడ్డి (అనంతపురం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా డాక్టర్ బి. రామచంద్ర (అనంతపురం), సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ కె. ఈశ్వర్ రెడ్డి (అనంతపురం), కోశాధికారిగా డాక్టర్ ఎంటీ జ్యోత్స్న, రాష్ట్ర కౌన్సిలర్లుగా డాక్టర్ టీఎస్. శ్యామ్‌ప్రసాద్, డాక్టర్ శివశంకర్, డాక్టర్ ఎంఎన్. బృంద, బి.జమీల బీబీని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఆశావాది శశాంక మౌళి వ్యవహరించారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

మహమ్మారి పొంచి ఉన్నా మొద్దునిద్రే..

- బెంగళూరులో 'హెచ్ఎంపీవీ' కలకలం
- ఇద్దరు శిశువులకు వైరస్ నిర్ధారణ
- నిద్రమత్తులో కూటమి ప్రభుత్వం
- ముందస్తు చర్యలు తీసుకోవడంలో ఆరోగ్యశాఖాధికారుల విఫలం


అనంతపురం మెడికల్: కోవిడ్ మహమ్మారి ఎంతో మంది ప్రాణాలను పొట్టనపెట్టుకుంది. వేల సంఖ్యలో కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయాయి. కోవిడ్ పేరు వింటే ఇప్పటికీ హడలెత్తిపోతున్నారంటే అతిశయోక్తి కాదు. ఇటీవల అదే కోవకు చెందిన మరో వైరస్ కలవరపెడుతోంది. ఉమ్మడి జిల్లాకు సమీపంలోని బెంగళూరులో పంజావిసిరింది. దీంతో కర్ణాటక వాసులే కాకుండా దేశమే ఉలిక్కిపడింది. ఇంత జరుగుతున్నా ఉమ్మడి జిల్లాలో అధికార యంత్రాంగం మొద్దు నిద్ర వీడకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వందలాది మంది రాకపోకలు..

చైనాలో హ్యూమన్ మెటాన్యూమో వైరస్ (హెచ్ఎంపీవీ) కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. మనదేశంలోనూ ఈ మహమ్మారి జాడలు బెంగళూరులో కన్పించాయి. ఇద్దరు శిశువుల్లో హెచ్ఎంపీవీ వైరస్ ఆనవాళ్లు ఉన్నట్లు వైద్యులు ధ్రువీకరించారు. జిల్లా నుంచి బెంగళూరుకు, అక్కడి నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు రోజూ వేలాది మంది ప్రయాణిస్తుంటారు. హైదరాబాద్ నుంచి వచ్చే వారు సైతం అనంతపురం మీదుగానే బెంగళూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి తరుణంలో జిల్లాపై వైరస్ ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు. ఈ క్రమంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన ఆరోగ్యశాఖాధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం. సర్వజనాస్పత్రిలో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయాల్సి ఉన్నా, అటువంటి చర్యలేమీ తీసుకోలేదు. పైగా జిల్లాలో కేసులు నమోదుకాలేదంటూ వైద్య ఆరోగ్య శాఖాధికారి ప్రకటన ఇవ్వడం చర్చనీయాంశమవుతోంది.

లక్షణాలు ఇలా..

కోవిడ్ తరహాలో హెచ్ఎంపీవీ కూడా శ్వాసకోశ రుగ్మతలను కలిగిస్తుంది. జ్వరం, దగ్గు, ముక్కు కారడం, గొంతు నొప్పి తదితర లక్షణాలుంటాయి. వైరస్ తీవ్రత ఎక్కువగా ఉన్న వారిలో బ్రాంకైటీస్, నిమోనియాకు దారితీస్తుంది. చిన్నారులు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిని తీవ్రంగా ఇబ్బంది పెట్టే అవకాశం ఉంది.



వ్యాప్తి ఇలా..

తుమ్ములు, దగ్గు వల్ల వెలువడే తుంపర్ల నుంచి, వైరస్ బారిన పడ్డ వారితో సన్నిహితంగా ఉండడం తదితర చర్యల ద్వారా హెచ్ఎంపీవీ వ్యాప్తి చెందుతుంది.

చిన్నపిల్లలు, వృద్ధులపై ప్రభావం



హ్యూమన్ మెటా న్యూమో వైరస్‌కు సంబంధించిన కేసులు జిల్లాలో నమోదు కాలేదు. ఈ వైరస్ కూడా కరోనా తరహాలో ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. చిన్నపిల్లలు, వృద్ధులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిపై ప్రభావం అధికంగా ఉంటుంది. కోవిడ్ సమయంలో తీసుకున్న జాగ్రత్తలే తీసుకోవాలి. వైరస్ సోకినట్లు అనుమానం ఉన్న వారు వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలి. ఆరోగ్యశాఖ అప్రమత్తంగా ఉంది. ముందస్తు చర్యలు చేపడతాం.

– డాక్టర్ భ్రమరాంబ దేవి, డీఎంహెచ్ఓ

నివారణ:

చేతులు తరచూ సబ్బుతో కనీసం 20 సెకన్లు కడుక్కోవాలి. బహిరంగ ప్రదేశాల్లో మాస్క్ ధరించాలి. వైరస్ సోకితే బయట తిరగకూడదు.

ప్రాజెక్టుల పూర్తికి చర్యలు వేగవంతం

అనంతపురం అర్బన్: జిల్లాలో ప్రాజెక్టుల పూర్తికి చర్యలను వేగవంతం చేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 544డీ, 67, 544డీడీ, 42, 150ఏ జాతీయ రహదారులు, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఏపీ ట్రాన్స్‌కో, జెన్‌కో, ఏపీఐఐసీ, రైల్వేస్, తదితర ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ, పరిహారం పంపిణీ, పనులు చేపట్టడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. భూ సేకరణలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలసత్వానికి తావివ్వకూడదని చెప్పారు. ఏపీఐఐసీ పార్కు ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని త్వరగా గుర్తించాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ ఎ.మలోల, ఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ సంపత్‌కుమార్, సర్వే ఏడీ రూప్లానాయక్, ఎన్‌హెచ్ఏఐ పీడీ తరుణ్‌కుమార్, కలెక్టరేట్ భూపరిపాలన సూపరింటెండెంట్ రియాజుద్దీన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

- ఓటర్ల తుది జాబితా విడుదల
- జిల్లాలో మొత్తం ఓటర్లు 20,22,229
- పురుషుల కంటే మహిళల ఓట్లే ఎక్కువ

అతివలే అధికం



జాబితాను విడుదల చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: జిల్లాలో పురుషుల ఓట్ల కంటే మహిళల ఓట్లే అధికంగా ఉన్నట్లు వెల్లడైంది. గత ఏడాది కంటే ఓట్ల సంఖ్య పెరిగింది. తుది ఓటర్ల జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సోమవారం శింగనమల తహసీల్దారు కార్యాలయంలో విడుదల చేశారు. ఆ వివరాల ప్రకారం.. జిల్లాలో 20,22,229 మంది సాధారణ ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్ల 9,99,357 మంది, మహిళా ఓటర్లు 10,22,625 మంది, థర్డ్‌జెండర్ ఓటర్లు 247, సర్వీసు ఓటర్లు (సైనికులు, వారి కుటుంబ సభ్యులు) 2,056 మంది ఉన్నారు. గత ఏడాది అక్టోబరు 29న విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 20,20,441 మంది ఓటర్లు ఉండగా ప్రస్తుత తుది జాబితా ప్రకారం ఆ సంఖ్య 20,22,229కి చేరింది.

నియోజకవర్గాల వారీగా ఓటర్లు ఇలా...

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం
రాయదుర్గం	1,30,549	1,33,528	44	2,64,121
ఉరవకొండ	1,10,832	1,14,075	28	2,24,935
గుంతకల్లు	1,33,230	1,38,158	74	2,71,462
తాడిపత్రి	1,23,466	1,25,558	26	2,49,050
శింగనమల	1,23,321	1,24,779	29	2,48,129
అనంతపురం	1,37,824	1,43,741	28	2,81,593
కళ్యాణదుర్గం	1,14,834	1,16,976	7	2,31,817
రాప్తాడు	1,25,301	1,25,810	11	2,51,122
మొత్తం	9,99,357	10,22,625	247	20,22,229



23 వేలు అధికం

జిల్లాలోని 8 నియోజకవర్గాల పరిధిలోనూ పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు అధికంగా ఉండటం గమనార్హం. మొత్తంగా 23,268 మంది ఎక్కువగా ఉండటం విశేషం. అత్యధికంగా అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 5,917 మంది, గుంతకల్లులో 4,928 మంది ఉన్నారు. ఆ తర్వాత రాయదుర్గంలో 2,979 మంది, ఉరవకొండ-3,243 మంది, తాడిపత్రి-2,092, శింగనమల-1,458, కళ్యాణదుర్గం-2,142, రాప్తాడు నియోజకవర్గంలో 509 మంది ఉన్నారు.

పెరిగిన ఓటర్లు..

తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 4,067 మంది ఓటర్లు పెరిగారు. గత ఏడాది ఏప్రిల్ 29న ఓటర్ల తుది జాబితా ప్రకటించారు. దాని ప్రకారం జిల్లాలో 20,18,162 మంది ఓటర్లు ఉన్నారు. ఓటర్ల జాబితా సవరణ-2025లో భాగంగా ప్రస్తుతం విడుదల చేసిన తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో 20,22,229 మంది ఉండటం గమనార్హం. మొత్తంగా 4,067 మంది కొత్త ఓటర్లు నమోదయ్యారు.

కోర్టు ఉత్తర్వుల ధిక్కరణ

- పోలీసుల సమక్షంలోనే టీడీపీ నేత అక్రమ నిర్మాణం



సోమవారం రాత్రి పోలీసుల సమక్షంలోనే కడుతున్న అరుగు

యాడికి: మండలంలోని తూట్రాళ్లపల్లిలో టీడీపీ నేత లక్ష్మీరెడ్డి సోమవారం రాత్రికి రాత్రే రోడ్డును ఆక్రమించి అరుగు నిర్మించాడు. లోకాయుక్త ఆదేశాలను ధిక్కరించి యథేచ్ఛగా చేపట్టిన ఈ నిర్మాణానికి పోలీసులు రక్షణగా నిలవడం గ్రామస్తులను విస్మయానికి గురి చేసింది. వివరాలు... తూట్రాళ్లపల్లికి చెందిన వెంకటనాగిరెడ్డి, లక్ష్మీరెడ్డి కుటుంబాలు ఎదురెదురు ఇళ్లలో నివాసముంటున్నాయి. కొంత కాలంగా లక్ష్మీరెడ్డి తన ఇంటికి ఆనుకుని రోడ్డుపై రాళ్లు, ఎద్దులబండి అడ్డం పెట్టాడు. దీంతో ఇంటి నుంచి ట్రాక్టర్ బయటకు తీయడానికి ఇబ్బంది అవుతుండడంతో వెంకటనాగిరెడ్డి లోకాయుక్తను ఆశ్రయించాడు. దీంతో లక్ష్మీరెడ్డి ఏర్పాటు చేసిన వాటిని తొలగించాలంటూ ఎంపీడీఓకు లోకాయుక్త ఉత్తర్వులు జారీ చేసింది. రెండు వారాల క్రితం ఎంపీడీఓ వీర్రాజు, పోలీసులు అక్కడకు చేరుకుని రోడ్డుపై ఉంచిన రాళ్లను తొలగించారు. ఈ క్రమంలో లక్ష్మీరెడ్డి... లోకాయుక్త ఉత్తర్వులను ధిక్కరిస్తూ శనివారం రాత్రి అరుగు నిర్మాణం చేపట్టాడు. దీంతో వెంకటనాగిరెడ్డి ఎంపీడీఓ, పంచాయతీ అధికారులకు తెలిపినా వారు స్పందించలేదు. డయల్ 100కు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అక్కడకు చేరుకుని నిర్మాణాన్ని ఆపారు. లక్ష్మీరెడ్డి దౌర్జన్యంపై సోమవారం ఎంపీడీఓను కలసి వెంకటనాగిరెడ్డి ఫిర్యాదు చేశారు. అనంతరం రాత్రి 7 గంటలకు పది మంది కూలీలను ఏర్పాటు చేసుకుని లక్ష్మీరెడ్డి అరుగు నిర్మాణం చేపట్టడంతో వెంకటనాగిరెడ్డి మరోసారి డయల్ 100కు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. వారి సమక్షంలోనే లక్ష్మీరెడ్డి అరుగు నిర్మాణం పూర్తి చేశాడు.

క్లుప్తంగా

గుండెపోటుతో యువకుడి మృతి


మణి (ఫైల్)

గుంతకల్లు రూరల్: పట్టుమని మూడు పదుల వయస్సు కూడా లేని ఓ యువకుడు గుండెపోటుకు గురై మృతి చెందడం స్థానికులను కలవరానికి గురి చేసింది. వివరాలు... గుంతకల్లు మండలం కసాపురం గ్రామానికి చెందిన మణి (27)కి ఐదేళ్ల క్రితం మహాలక్ష్మి అనే అమ్మాయితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మణి పెయింటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఛాతిలో నొప్పిగా ఉందంటూ కుటుంబసభ్యులు తెలపడంతో మణిని వెంటనే గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. విషయం తెలయగానే గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. చిన్న వయస్సులోనే గుండెపోటుతో మృతి చెందడం స్థానికులను ఆందోళనకు గురి చేసింది.

బెస్తలకు రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించాలి


మాట్లాడుతున్న కేవీ రమణ

రాయదుర్గం టౌన్: బెస్త కులస్తులకు రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించాలని బెస్త సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ, ప్రధాన కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక భంభంస్వామి ఆశ్రమంలో రాయదుర్గం నియోజకవర్గ బెస్తల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా సంఘం నేతలు రమణ, భాస్కర్ మాట్లాడారు. రాజకీయ ఎదుగుదల లేకుండా బెస్తలను అణగదొక్కుతున్నారని మండిపడ్డారు. రాజకీయంగా బెస్తలు రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్నారు తప్ప క్షేత్రస్థాయిలో బెస్తలు ఎదుర్కొంటున్న సమస్యలపై పాలకులు దృష్టి సారించడం లేదన్నారు. రాయదుర్గంలో శ్మశాన వాటిక కోసం ఏర్పాటు చేసుకున్న స్థలాన్ని సైతం దౌర్జన్యపరులు కబ్జా చేసి మట్టిని అక్రమంగా విక్రయిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, ఎమ్మెల్యే జోక్యం చేసుకుని సదరు స్థలాన్ని పరిశీలించి బెస్తలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బెస్తలకు అక్కడ కమ్యూనిటీ హాలు, బెస్తల కులదైవం గంగమ్మ ఆలయ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలన్నారు.

బెస్త సంఘం నూతన కమిటీ ఎన్నిక : జిల్లా బెస్త సంఘం ఆధ్వర్యంలో రాయదుర్గం బెస్త సేవా సంఘం నూతన కమిటీ సోమవారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా గోవిందరాజులు, గౌరవాధ్యక్షురాలుగా కమలమ్మ, ఉపాధ్యక్షుడిగా పవన్‌స్వామి, కార్యదర్శిగా నాగరాజు, కమిటీ సభ్యులు రాజు, మహేశ్వర్, నాగరాజు, నాగేంద్ర, ఎర్రిస్వామి, శ్రీరాములు, సాకమ్మ, గాయత్రి, శిల్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



ఇద్దరు దివ్యాంగుల ఆలోచన నేడు వైకల్యంతో బాధపడుతున్న వేలాది మందికి కల్పతరువుగా మారింది. చిన్నప్పుడు తాము పడిన ఇబ్బందులు ఏ ఒక్క దివ్యాంగుడికీ రాకూడదన్న వారి ఆలోచన సమర్థనం ట్రస్ట్ ఏర్పాటుకు దారి తీసింది. అనూహ్య విజయాలను సొంతం చేసుకుని నేడు దేశ వ్యాప్తంగా విస్తృత సేవలందిస్తోంది. దివ్యాంగులను ట్యాక్స్ పేయర్‌గా మార్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న 'సమర్థనం' ట్రస్ట్ ప్రస్థానంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

అంధుల ఆశాదీపం... సమర్థనం

దివ్యాంగులకు దన్నుగా నిలుస్తున్న ట్రస్ట్
- నైపుణ్యాభివృద్ధి శిక్షణ. క్రీడా రంగాలకు అధిక ప్రాధాన్యత
- శిక్షణతో పాటు ఉద్యోగావకాశాల కల్పన



సమర్థనంలో శిక్షణ తీసుకుంటున్న దివ్యాంగ విద్యార్థులు, అప్పటి రాష్ట్రపతి ప్రణబ్‌తో చైల్డ్ వెల్ఫేర్ డిసేబుల్డ్ జాతీయ అవార్డు తీసుకుంటున్న మహంతేష్ (ఫైల్)

చిలమత్తూరు: వికలాంగుల ప్రపంచాన్ని మార్చాలనే ఆశయంతో దృష్టి లోపంతో బాధపడుతున్న బెంగళూరుకు చెందిన మహంతేష్ తన స్నేహితుడు నగేష్‌తో కలసి 1997లో సమర్థనం ట్రస్ట్‌ను స్థాపించారు. ఈ క్రమంలో దివ్యాంగులు గౌరవంగా జీవిస్తూ పన్ను చెల్లించే వ్యక్తులుగా గౌరవించబడే స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో ఎన్నో సవాళ్లను అధిగమించారు. విద్య, నైపుణ్యం, క్రీడలు, పర్యావరణం, కళలు, సంస్కృతి, పునరావాసం, ఆరోగ్యం, పోషకాహారంతో సహా విభిన్న కార్యక్రమాలతో ప్రతి స్థాయిలో దివ్యాంగులకు దన్నుగా నిలిచేలా సమర్థనం ట్రస్ట్‌ను తీర్చిదిద్దారు. బెంగళూరులో మొదలైన ప్రస్థానం నేడు గుంటూరు, కొడికొండ చెక్‌పోస్ట్, ఢిల్లీ, ముంబయి, పూణే, చెన్నై, హైదరాబాదుతో పాటు 14 చోట్ల సమర్థనం లైవ్‌లీ హుడ్ రీసోర్స్ సెంటర్లకు విస్తరించింది. సమర్థనం ట్రస్ట్ సేవలను గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలుమార్లు అవార్డులతో నిర్వాహకులను సత్కరిస్తున్నాయి. 2024లో సంస్థ ఫౌండర్ మహంతేష్‌ను గౌరవ డాక్టరేట్‌తో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం సత్కరించింది.

మూడు నెలల పాటు శిక్షణ..

చిలమత్తూరు మండలంకొడికొండ చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన సమర్థనం ట్రస్ట్ శాఖ ద్వారా ఇప్పటి వరకూ 1,297 మంది దివ్యాంగులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలు కల్పించారు. శిక్షణా కాలంలో వసతితో పాటు అన్ని విధాలుగా నిర్వాహకులు అండగా నిలుస్తున్నారు. 2016లో అనంతపురం కేంద్రంగా ట్రస్ట్ కార్యకలాపాలు మొదలు కాగా, కొడికొండ చెక్‌పోస్టు వద్ద ఓ దాత విరాళంగా అందజేసిన మూడు ఎకరాల స్థలంలో శాశ్వత భవనాలు నిర్మించి 2022 నుంచి కార్యక్రమాలను విస్తృతం చేశారు. అంతేకాక ట్రస్ట్ ద్వారా ఏటా 100 మంది దివ్యాంగ విద్యార్థులకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకూ ఉపకార వేతనాలు అందిస్తున్నారు. అలాగే కళలు, క్రీడల్లో ఆసక్తి ఉన్న వారికి సమర్థనం ట్రస్ట్ మంచి అవకాశాలు కల్పిస్తోంది. దీని కోసం సునధ పేరుతో ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నారు. సంస్థ ఫౌండర్ మహంతేష్ అంతర్జాతీయ క్రికెట్‌లో దివ్యాంగుల భారత జట్టు తరఫున ఆడారు. ప్రస్తుతం ఆయన క్రికెట్ అసోసియేషన్ ఫర్ బ్లైండ్ ఇండియాకు చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.

ట్యాక్స్ పేయర్స్‌గా మార్చాలన్నదే నా కల



నా చిన్నప్పుడు చదువుకునేందుకు ఆర్థిక పరిస్థితులు బాగా ఇబ్బంది పెట్టాయి. దీనికి తోడు దివ్యాంగుడిని కావడంతో సమాజంలో పరిస్థితులు ప్రతికూలంగా ఉండేవి. దీంతో నాలాంటి దివ్యాంగుల కోసం ఏదో ఒకటి చేయాలని అప్పుడే అనుకున్నా. సమర్థనం ట్రస్ట్ ఏర్పాటు చేసి, ప్రస్తుతం 14 కేంద్రాల్లో వేలాది మందికి దారి చూపెడుతున్నాం. వారిని ట్యాక్స్ పేయర్స్‌గా మార్చాలన్నదే నా సంకల్పం. 800 మందికి పైగా ఉద్యోగులు మా సంస్థలో పనిచేస్తున్నారు.

– డా. మహంతేష్, ఫౌండర్, సమర్థనం ట్రస్ట్

'కేఎస్ఎన్' డిగ్రీ సెమిస్టర్ ఫలితాల విడుదల


ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ సత్యలత

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో మూడో సెమిస్టర్ ఫలితాలను సోమవారం ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేసీ సత్యలత విడుదల చేశారు. మొత్తం 438 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 390 మంది (89.04 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బీఏ (ఆనర్స్)లో 85 మందికి గాను 78 మంది, బీకామ్ (ఆనర్స్)లో 124 మందికి గాను 118 మంది, బీఎస్సీ (ఆనర్స్)లో 229 మందికి గాను 194 మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలను బుధవారం కళాశాల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. రీవాల్యుయేషన్, పర్సనల్ వెరిఫికేషన్‌కు సంబంధించి ఈ నెల 19వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒక్కో పేపర్‌కు రూ. 300 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

కళాశాల టాపర్లు వీరే.. బోయ సృజన (కెమిస్ట్రీ) 9.15 గ్రేడ్ పాయింట్లతో కళాశాల టాపర్‌గా నిలిచింది. అలాగే కవితాకర్ సుష్మ (మ్యాథమెటిక్స్) 9.08 పాయింట్లు, సంపంగి చందన (మ్యాథమెటిక్స్) 9.06 పాయింట్లు సాధించి ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరిని ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీరంగయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ హెచ్. శివశంకర్, అధ్యాపకులు అభినందించారు.

ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ

తాడిపత్రి టౌన్: స్థానిక శ్రీనివాసపురం నివాసముంటున్న ఉపాధ్యాయ దంపతులు వెంకట్రామిరెడ్డి, శశికళ ఇంట్లో చోరీ జరిగింది. సోమవారం ఇంటికి తాళం వేసి వారు విధులకు వెళ్లారు. తాడిపత్రి మండలం తేరన్నపల్లి గ్రామ ప్రభుత్వ స్కూల్‌లో వెంకటరామిరెడ్డి, పుట్లూరు మండలం చింతకుంట గ్రామ ప్రభుత్వ పాఠశాలలో శశికళ పనిచేస్తున్నారు. సాయంత్రం తిరిగి వచ్చిన వారు ఇంటి వెనుక తలుపు తీసి ఉండడం, లోపల బీరువాలోని వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉండడం గమనించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. 6 తులాల బంగారు నగలు అపహరించుకెళ్లినట్లు బాధితులు చేసిన ఫిర్యాదు మేరకు సీఐ సాయిప్రసాద్, ఎస్ఐ గౌస్‌బాషా కేసు నమోదు చేశారు. క్లూస్ టీంను రంగంలో దించి దుండగుల వేలి ముద్రలు సేకరించి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

టమాట రైతులను ఆదుకోవాలి


కలెక్టరేట్ గేటు ఎదుట నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు, రైతులు

అనంతపురం అర్బన్: టమాట పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు పరిహారం చెల్లించాలని, టమాట రైతులను ఆదుకోవాలంటూ రైతు సంఘం నాయకులు, రైతులు సోమవరం కలెక్టరేట్ గేటు ఎదుట టమాటను పోసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. జిల్లాలో 23 వేల హెక్టార్లలో టమాట సాగులో ఉందన్నారు. అయితే పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో దళారుల చేతిలో రైతులు దగాపడుతున్నారన్నారు. ధర పడిపోవడంతో కనీసం పంట రవాణా, కూలీల ఖర్చులు కూడా చేతికి అందకుండా పోతున్నాయన్నారు. జిల్లాలో ప్రభుత్వం టమాట మార్కెట్ ఏర్పాటు చేసి రైతులకు శాశ్వత పరిష్కారం చూపించాలన్నారు. అలాగే టమాట ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. టమాట మార్కెట్‌లో ఒకసారి వేలం వేసి ధర నిర్ణయించిన తరువాత ధరను తగ్గించకుండా చూడాలని, రూ.100కు 10 శాతం కాకుండా రూ.4 కమీషన్ తీసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు తరిమెల నాగరాజు, సహాయ కార్యదర్శి బీహెచ్‌రాయుడు, రైతులు పోతులయ్య, సుబ్బిరెడ్డి, నాగార్జున, చంద్రశేఖర్‌రెడ్డి, రవి నారాయణరెడ్డి, ప్రతాపరెడ్డి, రవితేజ, వెంట్రామిరెడ్డి, పరమేష్, సుధాకర్, రామలింగారెడ్డి, పెద్దన్న పాల్గొన్నారు.

రెండు గ్రామాలు.. ఓ దేవర దున్న

- మాదంటే మాదంటూ గొడవ
- ఎస్పీ కార్యాలయం వద్ద ఆందోళన
- ఎవరికీ హక్కు లేదన్న పోలీసులు
- స్వేచ్ఛగా వదిలేయడానికి ఇరు గ్రామాల అంగీకారం


జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ముద్దలాపురం గ్రామస్తులు

కూడేరు/అనంతపురం: ఓ దేవర దున్నపోతు పంచాయితీ రెండు గ్రామాల మధ్య ఉద్రిక్తతకు దారి తీసింది. ఆ దున్న తమదేనంటూ కూడేరు మండలం ముద్దలాపురం, కడదరకుంట గ్రామాల ప్రజలు పట్టుదలకు పోయారు. ఇది కాస్తా వివాదంగా మారి కొన్ని రోజులుగా కొనసాగుతూ వచ్చింది. చివరకు పోలీసుల జోక్యంతో సోమవారం ఈ వివాదానికి తెర పడింది. వివరాల్లోకి వెళితే...కడదరకుంట గ్రామంలో ఈ నెల 20, 21 తేదీల్లో బొడ్రాయి ప్రతిష్ట సందర్భంగా ఊరి దేవర ఉంది. అలాగే ముద్దలాపురంలో 21, 22 తేదీల్లో ముత్యాలమ్మ దేవత ప్రతిష్ట సందర్భంగా ఊరి దేవర నిర్వహించనున్నారు. ఇటీవల దున్నపోతు కడదరకుంట గ్రామంలోకి వెళ్లడంతో ఊరి దేవర సందర్భంగా బలి ఇచ్చేందుకు గ్రామస్తులు కట్టేసుకున్నారు. విషయం తెలుసుకున్న ముద్దలాపురం గ్రామస్తులు కడదరకుంటకు వెళ్లి దున్నపోతు తమదని, వదలాలని కోరారు. ఈ సందర్భంగా వారి మధ్య వాగ్వాదం జరిగింది. తర్వాత కూడేరు పోలీసు స్టేషన్‌లో ముద్దలాపురం గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఇరు గ్రామాల ప్రజలను సీఐ రాజు పిలిపించి విచారించారు. దున్నపోతు వయసు ఎంత ఉంటుందని ఆరా తీశారు. ఒక్కో గ్రామస్తులు ఒక్కోలా వయసు చెప్పారు. పశు వైద్యాధికారులతో పరీక్షింపజేసి వయసు కరెక్ట్‌గా చెప్పిన గ్రామానికి దున్నపోతును పంపిస్తామని పోలీసులు తెలిపారు.


ఎస్పీ కార్యాలయం వద్ద ఆందోళన

దున్నపోతు ముమ్మాటికీ తమదేనంటూ ముద్దలాపురం వాసులు సోమవారం కలెక్టరేట్లో జరిగే ప్రజా వేదికలో ఫిర్యాదు చేసేందుకు మహిళలతో సహా వంద మందికి పైగా ఐదు ట్రాక్టర్లలో అనంతపురం చేరుకున్నారు. కలెక్టరేట్లో ప్రజావేదిక లేదని అధికారులు చెప్పడంతో అక్కడి నుంచి ఎస్పీ కార్యాలయానికి చేరుకుని..తమకు న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. అక్కడే పోలీసు స్పందనలో ఉన్న కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు వారి సమస్యను విని పరిష్కారం చూపాలని కూడేరు సీఐ రాజును ఆదేశించారు. దీంతో సీఐ ఇరు గ్రామాల ప్రజలను పోలీసు స్టేషన్‌కు పిలిపించుకుని మాట్లాడారు. ఇరు గ్రామాలకూ దున్నపోతుపై హక్కు లేదని, రెండు గ్రామాల్లో దేవర ముగిసే వరకు పోలీసుల సంరక్షణలో ఉంటుందని, తర్వాత స్వేచ్ఛగా వదిలేద్దామని చెప్పారు. ఇందుకు ఇరు గ్రామాల ప్రజలు అంగీకరించారు. దీంతో వివాదానికి తెరపడింది.

తాడిపత్రి పోలీసు సబ్ డివిజన్‌లోకి పుట్లూరు, యల్లనూరు

తాడిపత్రి రూరల్: శింగనమల మండలం పుట్లూరు, యల్లనూరు పోలీసు స్టేషన్లను తాడిపత్రి పోలీసు సబ్ డివిజన్‌లో కలుపుతూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. పరిపాలన సౌలభ్యం కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ మండలాలను తాడిపత్రి సబ్ డిజన్ నుంచి తప్పించి అనంతపురం రూరల్ సబ్ డివిజన్‌లోకి చేర్చిన విషయం తెలిసిందే. అయితే వీటిని తిరిగి పూర్వపు సబ్‌డివిజన్ పరిధిలోకి చేస్తూ కూటమి సర్కార్ ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.

'అనంత'లో వృద్ధురాలి హత్య


సావిత్రి మృతదేహం

అనంతపురం: జిల్లా కేంద్రంలో సోమవారం సాయంత్రం ఓ వృద్ధురాలు దారుణ హత్యకు గురైంది. గొంతు కోయడంతో రక్తమడుగులోనే కొట్టుమిట్టాడుతూ తుదిశ్వాస విడిచింది. అనంతపురం నాల్గో పట్టణ పీఎస్ సీఐ కె.సాయినాథ్ తెలిపిన మేరకు... రుద్రంపేట పంచాయతీ టీచర్స్ కాలనీలో నివాసముంటున్న సావిత్రి (63), ఓబులేసు దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అటవీశాఖలో సూపరింటెండెంట్‌గా ఉద్యోగ విరమణ చేసిన కొంత కాలానికే ఓబులేసు మృతి చెందారు. అప్పటి నుంచి టీచర్స్ కాలనీలోని సొంతింట్లో సావిత్రి ఒంటరిగానే జీవిస్తోంది. పెద్ద కుమారుడు, కుమార్తె ఉద్యోగరీత్యా యూఎస్ఏలో స్థిరపడ్డారు. చిన్న కుమారుడు విజయ్‌కుమార్ నగరంలోని కోవూరు నగర్‌లో నివాసముంటూ రోజూ ఇంటి వద్ద నుంచి తల్లికి భోజనం తీసుకెళ్లి ఇచ్చి వస్తుండేవాడు. తల్లి బాగోగులు చూసుకునేందుకు ఇంటి వద్ద ఓ మనిషిని ఏర్పాటు చేశారు. సోమవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో సావిత్రి ఇంటి వద్దకు పనిమనిషి రమణమ్మ వెళ్లింది. ఇంటి ప్రధాన ద్వారం తీసి ఉండడంతో అనుమానం వచ్చిన ఆమె లోపలికి వెళ్లి చూడగా, వంటగదిలో గొంతుకు గాయమై రక్తమడుగులో కొట్టుమిట్టాడుతూ మృతి చెందిన సావిత్రి కనిపించింది. విషయాన్ని వెంటనే ఆ ఇంటి పైపోర్షన్‌లో అద్దెకు ఉంటున్న వారికి తెలపడంతో వారి ద్వారా సమాచారం అందుకున్న కుమారుడు విజయ్‌కుమార్, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. నేరం జరిగిన ప్రాంతంలో నిందితుల జాడను గుర్తించేందుకు డీఎస్పీ వి.శ్రీనివాసరావు, సీఐలు కె.సాయినాథ్, శ్రీకాంత్, రాజేంద్రనాథ్ యాదవ్, శాంతిలాల్ జల్లెడ పట్టారు. క్లూస్‌టీం, స్నిఫ్ఫర్ డాగ్ స్క్వాడ్‌ను రంగంలో దించారు. నిందితుల వేలి ముద్ర నమూనాలను సేకరించారు. వృద్ధురాలి మెడలో బంగారు చైను, సెల్‌ఫోన్ కనిపించక పోవడంతో వాటి కోసం దారుణానికి ఒడిగట్టి ఉంటారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. హతురాలి ఫోన్ స్విచ్ఛాఫ్ అయి ఉంది. కాల్‌డేటాను సేకరించారు. పరిసరాల్లో ఉన్న సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. రక్త మరకలు వంట గది నుంచి ప్రధాన ద్వారం వరకు పడి ఉన్నాయి. దీనిని బట్టి ప్రధాన ద్వారం వద్దనే ఆమె గొంతు కోసి ఉంటారనే అనుమానాలూ వ్యక్తమయ్యాయి. డబ్బు, బంగారం కోసమే హత్య చేశారా? లేక మరే ఇతర కారణాలు ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

యువకుడి దుర్మరణం


మృతుడు దస్తగిరి

గుత్తి రూరల్: మండలంలోని బసినేపల్లి శివారులో సోమవారం రాత్రి చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్నూలు జిల్లా తుగ్గలి మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన దస్తగిరి(33) పనిపై సోమవారం ద్విచక్రవాహనంలో గుత్తికి వచ్చాడు. పనులు ముగించుకొని రాత్రి స్వగ్రామానికి వెళుతుండగా బసినేపల్లి గ్రామ శివారులో వేగాన్ని నియంత్రించుకోలేక అదుపు తప్పి కిందపడ్డాడు. ఘటనలో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. రోడ్డు పక్కన పడి ఉన్న దస్తగిరి మృతదేహాన్ని గమనించిన స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేశారు. కాగా, మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు సమాచారం.

సమస్యలపై వినతుల వెల్లువ

- కలెక్టర్ వినోద్‌కుమార్
- శింగనమలలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'
- వినతులు ఇవ్వడానికి భారీగా తరలివచ్చిన ప్రజలు


కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రాలు అందజేస్తున్న ప్రజలు

శింగనమల: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. సోమవారం శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'ను నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగింది. ఈ సందర్భంగా వినతి పత్రాలు సమర్పించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మొత్తం 630 దాకా వినతిపత్రాలు అందడం గమనార్హం. అత్యధికంగా భూ సమస్యలపై ఉన్నట్లు తెలిసింది. కార్యక్రమం అనంతరం జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. రీ సర్వేలో ఎల్‌పీఎంపై సమస్యలు వస్తున్నాయని, వీటిపై ప్రజలకు అవగాహన కల్పించి అందరికీ న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో జేసీ శివ్ నారాయణ్ శర్మ, ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్‌ఓ మాలోల, డిప్యూటీ కలెక్టర్ శిరీష, ఆర్డీఓ కేశవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

- తమ భూమిని వేరొకరి పేరున 1-బీలో నమోదు చేశారని శింగనమల మండలం ఇరువెందల గ్రామానికి చెందిన బయమ్మ వాపోయారు. 350–2 సర్వే నంబరులో తమకు 1.03 ఎకరాల భూమి ఉందన్నారు. సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నా పట్టించుకోలేదన్నారు.
- తన అనుభవంలో ఉన్న భూమిని వెబ్‌ల్యాండ్ నుంచి తొలగించారని శింగనమల మండలం సలకంచెరువుకు చెందిన ముత్యాల శివ చెప్పారు. రీ-సర్వే సర్వే నంబరు తప్పుగా నమోదు చేశారని, న్యాయం చేయాలని కోరారు.
- శింగనమల మండలంలోని అలంకరాయునిపేట గ్రామంలో డ్రైనేజీ, సీసీ రోడ్లు నిర్మించాలని, గ్రామం నుంచి సలకంచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థుల కోసం కూతలేరు వంకపై బ్రిడ్జి నిర్మించాలని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు వినతిపత్రం అందజేశారు.
- శింగనమల మరువకొమ్మ వద్ద రోడ్డు సమస్యతో చాలా ఇబ్బంది పడుతున్నామని ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. కార్యక్రమం అనంతరం కలెక్టర్ పరిశీలించారు. హైవే పక్కనే ఉన్న కొండను తొలగించి, శింగనమలకు దారి ఏర్పాటు అధికారులను ఆదేశించారు.
- శింగనమలలో ఎస్సీ బాలికల వసతి గృహం పునః ప్రారంభించాలని ఎస్సీ సంఘం నేతలు, ఇంటి స్థలాలు మంజూరు చేయాలని పాత్రికేయులు, పాత పద్ధతి ప్రకారం 1బీ వచ్చేలా చూడాలని, హెచ్చెల్సీ చివరి ఆయకట్టు భూములకు సాగు నీరు అందించాలని సీపీఎం రాష్ట్ర నాయకులు ఓబులు వినతిపత్రాలు సమర్పించారు.

'అక్రమ కేసులతో ఎమ్మెల్యే తల్లి వేధిస్తున్నారు'

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తల్లి బండారు లీలావతి అక్రమ కేసులు పెట్టించి వేధిస్తున్నారని కలెక్టర్ వినోద్‌కుమార్‌కు గార్లదిన్నె మండలం కనంపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త ప్రసాద్ ఫిర్యాదు చేశారు. ఫీల్డు అసిస్టెంట్ పోస్టు అడుగుతున్నానని తనపై కక్ష కట్టారన్నారు. అగ్రకులాలకు చెందిన వారితో కలిసి దళితుడైన తనపై లీలావతి అక్రమ కేసులు పెట్టించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. తాను తప్పు చేయక పోయినా సోషల్ మీడియాలో అవమానిస్తున్నారన్నారు. కలెక్టర్ స్పందించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు ప్రసాద్ తెలిపారు.

క్లుప్తంగా

పరామర్శ



ప్రవీణ్ విఠల్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

అనంతపురం కార్పొరేషన్: ఇటీవల ఆకస్మిక మరణం పొందిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మాజీ జిల్లా సమన్వయకర్త ప్రవీణ్ విఠల్ రెడ్డి కుటుంబ సభ్యులను ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి సోమవారం పరామర్శించారు. మృతుడి కుటుంబ సభ్యుల్లో ధైర్యాన్ని నింపారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి వెంట వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

ఉద్యమ సూర్యుడు 'మార్పు బాలకృష్ణమ్మ'



మార్పు బాలకృష్ణమ్మ చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ ఉద్యమ సూర్యుడు దివంగత ఎమ్మెల్సీ, ఏపీటీఎఫ్ (1938) నాయకుడు మార్పు బాలకృష్ణమ్మ అని ఆ సంఘం నాయకులు కొనియాడారు. సోమవారం మార్పు బాలకృష్ణమ్మ వర్ధంతి సందర్భంగా స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ కళింగ సీమ (శ్రీకాకుళం)లో జమిందార్ల దోపిడీ, దౌర్జన్యాల నుంచి రైతులకు విముక్తి కల్పించడానికి అహర్నిశలు కృషి చేసిన 'మార్పు' మొదటి తరం కమ్యూనిస్టు నాయకుడు అన్నారు. ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చి ఏపీటీఎఫ్ పక్షాన నిలబడి ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస నాయక్, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి కులశేఖర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫీ, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, రవీంద్ర పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో కొలువుల పంట



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ సి.జయచంద్రారెడ్డి

అనంతపురం: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, అనంతపురంలో ఏకంగా 228 మంది విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలకు ఎంపికయ్యారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో మొత్తం 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో 228 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. మెకానికల్ 75, ఆటోమొబైల్ 11, ఎలక్ట్రికల్ 75, ఎలక్ట్రానిక్స్ విభాగంలో 67 మంది విద్యార్థులు కొలువులు దక్కించుకున్నారు. నెలకు రూ.18,500 జీతం, ఏడాది బోనస్ రూ.12 వేలు, ఉచిత రవాణా, భోజనం అందిస్తారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సి.జయచంద్రా రెడ్డి విద్యార్థులను అభినందించారు.

చిరుత దాడిలో 45 గొర్రె పిల్లల మృతి



మృతి చెందిన గొర్రె పిల్లలనుచూపుతున్న రైతు

రాయదుర్గం: మండలంలోని చదం గ్రామ సమీపంలో చిరుత దాడిలో 45 గొర్రె పిల్లలు సోమవారం మృతి చెందాయి. బాధిత కాపరులు తెలిపిన మేరకు.. గ్రామ సమీపంలోని ముత్తప్ప తోటలో ముత్తప్ప, బొమ్మయ్య, గంగాధర అనే కాపరులు గొర్రెలను మందకు వదిలారు. అక్కడే ఏర్పాటు చేసిన దొడ్డిలో గొర్రె పిల్లలు ఉంచి, మేత కోసం మందను అడవికి తీసుకెళ్లారు. మధ్యాహ్న సమయంలో దొడ్డిలోకి చిరుత చొరబడి దాడి చేసింది. బొమ్మయ్యకు చెందిన 10 గొర్రె పిల్లలు, గంగాధర కు చెందిన 20 గొర్రెపిల్లలు, ముత్తప్ప 15 గొర్రె పిల్లలు మృతి చెందినట్టు పశువైద్యాధికారి సూర్యనారాయణ తెలిపారు. వీటి విలువ సుమారు రూ.2.50 లక్షలు ఉంటుందని తెలిపారు. మరో 10 గొర్రె పిల్లలకు చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

సజావుగా వేలం

ఆత్మకూరు: పంపనూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఆలయ కార్యనిర్వహణ అధికారి, దేవదాయ శాఖ పర్యవేక్షణ అధికారి వన్నూర్‌స్వామి ఆధ్వర్యంలో టెంకాయల విక్రయ హక్కులకు వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో రూ.1.70 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ బాబు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

కోత మొదలైంది..



- దివ్యాంగుల పింఛన్ల తొలగింపునకు కూటమి ప్రభుత్వం కుట్ర
- అర్బన్ పరిధిలో పింఛన్ వెరిఫికేషన్ మరూ
- కాళ్లు, చేతులు చచ్చుబడిన వారికే రూ.15,000 పింఛన్
- పదుల సంఖ్యలో లబ్ధిదారులకు అనర్హత వేటు?



గుల్జార్‌పేటలో పింఛన్ లబ్ధిదారురాలిని చూసిన అనంతరం రిమార్క్స్ రాస్తున్న వైద్య బృందం



పింఛన్ లబ్ధిదారుతో వేలిముద్ర తీసుకుంటున్న సిబ్బంది

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం దివ్యాంగుల ఫించన్లకు ఎసరు పెడుతోంది. నడవలేని స్థితిలో ఉండి మంచానికి పరిమితమైన వారికి రూ.15,000 ఇస్తున్నట్లు ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. ఇటీవల అందుకు సంబంధించి ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో వివిధ విభాగాల వైద్యులు వికలాంగులకు స్క్రీనింగ్ చేశారు. అర్హులైన వారిని నిర్ధారించి వైద్యులు సర్టిఫికెట్లు మంజూరు చేశారు. కాగా ప్రతి నెలా రూ.15,000 పింఛన్ వస్తుందని భావించిన వికలాంగులకు గట్టి షాక్ తగలింది. పింఛన్లపై నిరాశే మిగులుతోంది.

నాలుగు బృందాలతో జల్లెడ

ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ మంజూరుకు సంబంధించి సోమవారం అర్బన్ పరిధిలోని 74 సచివాలయాల పరిధిలో ఆరుగురు స్పెషలిస్టు వైద్యులు, మెడికల్ ఆఫీసర్, సచివాలయ సిబ్బంది కలుపుకుని మొత్తం నాలుగు బృందాలుగా ఏర్పడి పింఛన్ వెరిఫికేషన్ చేపట్టారు. కాగా కాళ్లు, చేతులు చచ్చుబడిన వారికి మాత్రమే రూ.15,000 పింఛన్‌కు అర్హత ఉన్నట్లు అధికారులు పరోక్షంగా చెబుతున్నారు. ఆ విధంగా చూస్తే నగరంలో ఉన్న 122 మంది లబ్ధిదారుల్లో 60 శాతం మందికి పింఛన్‌లో కోత పడనున్నట్లు వైద్యులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. కొన్ని డివిజన్లలో కాళ్లు, చేతులు పోగొట్టుకున్న వారు అధిక సంఖ్యలో ఉన్నారు. కానీ వారు లేచి కూర్చుంటారు కనుక, వారికి పింఛన్‌కు అర్హత లేనట్లు రిమార్క్స్‌లో పొందుపర్చడం గమనార్హం. దీంతో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ ప్రశ్నార్థకంగా మారింది.

టీడీపీ నాయకుల ఓవరాక్షన్



పింఛన్ వెరిఫికేషన్‌లో వైద్యులతో పాటు టీడీపీ కార్యకర్త ముస్తఫా (తెల్ల టీషర్ట్)

పింఛన్ వెరిఫికేషన్‌లో టీడీపీ నాయకులు ఓవరాక్షన్ చేశారు. సోమవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో వైద్యుల బృందంతో పాటు టీడీపీ చోటా నాయకులు వెళ్లడం పెద్ద చర్చనీయాంశమైంది. గుల్జార్‌పేటలో ముస్తానే అనే టీడీపీ కార్యకర్త హల్‌చల్ చేశాడు. గుల్జార్‌పేటలో ఓ వికలాంగుడు ఆరోగ్యంగా ఉన్నాడని.. అతడికి పింఛన్ అవసరం లేదంటూ కర్నూలు నుంచి వచ్చిన ఓ ఫిజీషియన్, ఓ ఆర్థోపెడిషియన్‌కు సూచనలివ్వడం పెద్ద చర్చనీయాంశమైంది. పింఛన్ వెరిఫికేషన్‌లో టీడీపీ నాయకుల జోక్యం ఏమిటని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ఒక్క గుల్జార్‌పేటలో మాత్రమే కాదు.. ఇలా నగరంలోని వివిధ ప్రాంతాల్లో టీడీపీ నాయకులు వెరిఫికేషన్‌లో జోక్యం చేసుకుంటున్నారు.

నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి



ఏఐఎస్‌బీ సమర్పించిన ఆధారాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం అర్బన్: నారాయణ విద్యాసంస్థలు నరకాన్ని తలపిస్తున్నాయని, కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ వినోద్ కుమార్‌కు ఏఐఎస్‌బీ (ఆల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్) జిల్లా ప్రధాన కార్యదర్శి పృథ్వీ, వీఎస్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ విన్నవించారు. కలెక్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్ వద్ద వారు కలిసి నారాయణ విద్యాసంస్థల్లో నెలకొన్న అధ్వాన్న పరిస్థితిపై వినతిపత్రంతో పాటు ఆధారాలను సమర్పించారు. నగర శివారులోని నారాయణ బాలుర కళాశాల విద్యార్థులకు కనీస వసతులు లేకపోవడంతో నరకయాతన అనుభవిస్తున్నారని చెప్పారు. విద్యార్థులను కళాశాల యాజమాన్యం బానిసల్లా చూస్తోందన్నారు. వేళకు టిఫెన్, భోజనం పెట్టడం లేదని తెలిపారు. ఇక బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లను వారాలుగా శుభ్రం చేయకపోవడంతో వాసన వస్తున్నట్లు పేర్కొన్నారు. కళాశాలలో దుర్భర పరిస్థితులపై ఆర్‌ఐఓ వెంకటరమణనాయక్ దృష్టికి తీసుకెళ్లినా ఉదాసీనంగా వ్యవహరిస్తునారని ఫిర్యాదు చేశారు. కళాశాలలో పరిస్థితిని బయటికి చెబితే టీసీలు ఇస్తామని విద్యార్థులను బెదిరిస్తున్నారని ఆరోపించారు. కళాశాలపై సమగ్ర విచారణ జరిపించి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి నారాయణ కళాశాలను ముట్టడిస్తామన్నారు.

ఫారిన్ లాంగ్వేజెస్‌తో ఉద్యోగావకాశాలు



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎస్కేయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ బి.అనిత

అనంతపురం: ఆర్డీటీ ఆధ్వర్యంలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఫారిన్ లాంగ్వేజెస్ (జర్మన్, స్పానిష్, ఫ్రెంచ్) డిప్లొమో కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఆర్డీటీలో ప్రత్యేక శిక్షణ తీసుకుంటుండగా, ఎస్కేయూ సర్టిఫికెట్లు జారీ చేస్తుంది. ఈ నేపథ్యంలో మొత్తం 133 మందికి డిప్లొమో సర్టిఫికెట్లు అందజేశారు. జర్మన్ 45, స్పానిష్ 42, ఫ్రెంచ్ 46 మంది ఆయా బాషల్లో శిక్షణ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత మాట్లాడుతూ.. ఫారిన్ లాంగ్వేజెస్‌లో డిప్లొమో పూర్తి చేసిన విద్యార్థులకు తక్షణమే ఉద్యోగావకాశాలతో పాటు ఆకర్షణీయమైన వేతనం తీసుకోవడం సంతోషదాయకమన్నారు. ఆర్డీటీ సంస్థ విదేశీ అధ్యాపకులతో నాణ్యమైన శిక్షణ కల్పిస్తుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ.కృష్ణకుమారి, లాంగ్వేజెస్ డీన్ ప్రొఫెసర్ నరసింహన్, ఎవాల్యుయేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీ రమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేశ్వర్లు, ఆర్డీటీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మోహన మురళి, ఆర్డీటీ లాంగ్వేజెస్ కళాశాల ప్రిన్సిపాల్ గీతాంజలి, జర్మన్ టీచర్ సెశోలియా తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ర్యాష్ డ్రైవింగ్.. కన్ను కోల్పోయిన ద్విచక్ర వాహనదారుడు

- డాక్టర్ నిహారికపై ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు

అనంతపురం: ఓ డాక్టర్ ర్యాష్ డ్రైవింగ్ ద్విచక్రవాహనదారుడి కన్ను పోయేందుకు కారణమైంది. ఆలస్యంగా వెలుగు చూసిన సంఘటన వివరాలు బాధితుడు తెలిపిన మేరకు.. నగర శివారులోని బాలాజీ విల్లాస్ వెనుక గల జ్యుడీషియల్ కాలనీలో నివాసముంటున్న బొల్లిగొర్ల రాంబాబు (40) ఈ నెల రెండో తేదీన ఉదయం తోట పని ముగించుకుని ప్యాషన్ ప్లస్ ద్విచక్రవాహనంపై నగర శివారు నుంచి ఇంటికి బయల్దేరాడు. గుత్తిరోడ్డు సింధూర బార్ అండ్ రెస్టారెంట్ సమీపాన మిర్చి యార్డు సర్కిల్ వద్ద ఎడమ వైపున వెళ్తున్న ఇతడిని వెనకే వస్తున్న పామిడి హెడ్‌కానిస్టేబుల్ రామాంజనేయులు కుమార్తె అయిన డాక్టర్ నిహారిక ర్యాష్ డ్రైవింగ్ చేసుకుంటూ వచ్చి సడన్‌గా కుడివైపునకు తిరిగే క్రమంలో ఢీకొంది. తీవ్రంగా గాయపడిన రాంబాబును డాక్టర్ తన కారులోనే ఆనంద్ ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం జయ్ విష్ణు న్యూరో ఐ కేర్ సెంటర్‌లో ఎంఆర్ఐ, సీటీ స్కాన్ చేశారు. కుడి కన్ను పూర్తిగా కనపడదని రిపోర్టు వచ్చింది. వెంటనే బెంగళూరు నారాయణ నేత్రాలయ ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. అక్కడి డాక్టర్లు పరీక్ష చేసి, ఆప్టిక్ నర్వ్ దెబ్బతిన్నందున కుడి కంటి చూపు పోయిందని ధ్రువీకరించారు. ఆస్పత్రి నుంచి ఇంటికి వచ్చిన బాధితుడు రాంబాబు సోమవారం అనంతపురం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కిశోరి వికాసంతో బాలికల భవిష్యత్



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎంపీపీ హేమలత, అధికారులు

అనంతపురం సెంట్రల్: కిశోరి వికాసం కార్యక్రమం పునఃప్రారంభంతో ప్రతి బాలిక భవిష్యత్తును మెరుగుపర్చడానికి ఓ మంచి అవకాశమని ఐసీడీఎస్ సీడీపీఓ లలితమ్మ అన్నారు. సోమవారం మహిళా ప్రాంగణంలో అర్బన్ పరిధిలోని 3, 4 సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలకు, మహిళా పోలీసులకు, ఆరోగ్య కార్యకర్తలకు కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ కిశోరి బాలకల ఉజ్వల, ఆరోగ్యకర, సాధికారత దిశగా ఆమె వేసే ప్రతి ప్రతి అడుగుకు మనం చేదోడు వాదోడుగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఆత్మకూరు: కిశోరి వికాసం బాలికల బంగారు భవిష్యత్‌కు పునాది వేస్తుందని సీడీపీఓలు శ్రీదేవి, ధనలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ హేమలత అధ్యక్షతన మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, సచివాలయ సిబ్బందికి కిశోరి వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శారీరక మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడం కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. బాలికలు అన్ని విధాలా ఎదగడానికి విద్య ఎంతో అవసరమన్నారు. అయితే చాలా మంది పదో తరగతి ఫెయిల్ అయిన వారికి ప్రోత్సాహం లేకపోవడంతో అర్ధంతరంగా విద్యను ఆపేస్తున్నారన్నారు. ఇంటర్ చదవుతున్న సమయంలోనే బాల్య వివాహాలు చేయడం వల్ల బాలికల జీవితాలు ఛిద్రం చేస్తున్నారని తెలిపారు. మండలంలో ఎక్కడైనా బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్టపరంగా శిక్ష పడుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు లావణ్య, శ్రీవాణి, ఏపీఓ పద్మావతి, డాక్టర్ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

కోటంక చెరువుకు నీరివ్వాలని ధర్నా



ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు

అనంతపురం సెంట్రల్: గార్లదిన్నె మండలం కోటంక చెరువుకు వెంటనే నీరివ్వాలని రైతులు డిమాండ్ చేశారు. సోమవారం చిన్న నీటిపారుదల శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. చెరువుకు నీరు వచ్చేందుకు తవ్విన కాలువను ఓ వ్యక్తి అక్రమంగా పూడ్చడంతో నీరు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. 2008లో రూ.కోటి వ్యయంతో కాలవ తవ్వారన్నారు. చెరువును లోకలైజేషన్ కూడా చేశారని వివరించారు. చెరువును నింపడం ద్వారా కోటంక, తాడిచేర్ల, మర్తాడు తదితర గ్రామాల్లో భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని తెలిపారు. వేలాది ఎకరాల్లో చీనీ పంటల సాగుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గురువారం నుంచి నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్‌ఈ విశ్వనాథరెడ్డి హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తరిమెల నాగరాజు, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రామిరెడ్డి, సహాయ కార్యదర్శి బీహెచ్ రాయుడు, రైతులు నారాయణ రెడ్డి, నాగార్జున రెడ్డి, రవి, ప్రతాప్‌రెడ్డి, రవితేజ, వెంకట్రామి రెడ్డి, పరమేష్, సుధాకర్, రామలింగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

19న గిరిజన సమ్మేళనం

అనంతపురం టవర్‌క్లాక్: జీపీఎస్, జీవీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 19న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గిరిజన సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆ సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్ తెలిపారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు రవిరాజ్, శ్రీనివాస నాయక్, నారాయణ స్వామి నాయక్, సాకే ఆనంద్, భాస్కర్ నాయక్, డీకే రామలింగం, ప్రసాద్ నాయక్, మురళీ కృష్ణ నాయక్, నాగరాజు, టి.మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

రమేష్ నారాయణకు విశిష్ట సాహితీ పురస్కారం



రమేష్ నారాయణను సత్కరిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: అనంత సాహిత్యంలో శతాధిక గ్రంథాలు రాసిన డాక్టర్ పతికి రమేష్ నారాయణ మరో సాహితీ విశిష్ట పురస్కారం అందుకున్నారు. కరీంనగర్‌కు చెందిన శరత్ సాహితీ స్రవంతి రజోత్సవం సందర్భంగా విశిష్ట రచనలను పురస్కారాలతో గౌరవించింది. 'అవ్వ' తెలుగు కావ్యాన్ని ఆంగ్లంలో 'ది మదర్ ' పేరుతో అనువదించిన డాక్టర్ రమేష్ నారాయణ అనువాదాన్ని ఉత్తమ రచనగా స్వీకరించారు. తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెలిదండ్ల నిత్యానంద రావు, కర్ణాటక కేంద్రియ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య భట్టు సత్యనారాయణ తదితరుల చేతుల మీదుగా పురస్కారం అందజేశారు. ఆయన ద్విభాషా నైపుణ్యాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. రజోత్సవ పురస్కారమందుకున్న డాక్టర్ రమేష్ నారాయణను సాహిత్య భారతి, డాక్టర్ ఉమర్ ఆలీషా సాహితీ సమితి సంస్థల ప్రతినిధులు అభినందించారు.

అలౌకిక ఆనందానికి విష్ణుతత్వమే మార్గం

అనంతపురం కల్చరల్: మనిషి అలౌకిక ఆనందానికి విష్ణుతత్వమే చక్కటి మార్గమని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త కె.శారద అన్నారు. శ్రీశృంగేరీ శారదా శంకర మఠంలో జరుగుతున్న సువర్ణభారతి మహో మహోత్సవం సందర్భంగా సోమవారం రాత్రి మఠంలో ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. 'విష్ణుతత్వం' ముఖ్య అతిథిగా విచ్చేసిన శారద ప్రసంగిస్తూ పురాణేతిహాసాల్లోని పలు ఘట్టాలను వినిపించారు. కార్యక్రమంలో మఠం ప్రతినిధి సత్యప్రసాద్, డాక్టర్ ప్రఫుల్లా పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశం



బీఎల్ఓలకు ఓటర్ జాబితా పంపిణీ చేస్తున్న తహసీల్దార్ విజయకుమారి

రాప్తాడు: నియోజకవర్గ ఓటరు జాబితా ముసాయిదాను ప్రచురించినట్లు తహసీల్దార్ విజయకుమారి తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశాల మేరకు రాప్తాడులో ఎస్ఎస్ఆర్–2025 ఓటర్ జాబితాను విడుదల చేశారు. అనంతరం ఓటర్ జాబితాను బీఎల్ఓలకు పంపిణీ చేశారు. జాబితాలను పోలింగ్ స్టేషన్లలో ప్రదర్శించాలని బీఎల్ఓలను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరు మండలాల్లో 281 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, అందులో 1,25,301 మంది పురుష ఓటర్లు, 1,25,810 మంది మహిళా ఓటర్లు, 11 మంది థర్డ్ జెండర్ ఓటర్లతో కలిపి మొత్తం 2,51,122 మంది ఓటర్లు ఉన్నారన్నారు. నియోజకవర్గంలోని బీఎల్ఓలు అందరూ ఓటర్ జాబితాను తమ పోలింగ్ స్టేషన్లలో ప్రదర్శించి, మార్పులు, చేర్పులు ఏమైనా ఉంటే సరి చేసుకోవాలన్నారు.

ఆకట్టుకుంటున్న కళాఖండాలు

అనంతపురం కల్చరల్: నగరంలో గత నాలుగు రోజులుగా సాగుతున్న హస్తకళా ఉత్పత్తుల ప్రదర్శన మంగళవారంతో ముగియనుంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అనంతకు విచ్చేసిన హస్తకళాకారుల అల్లికల ఉత్పత్తులు అందరినీ ఆకర్షిస్తున్నాయి. హస్త కళలను ఆదరించాలని లేపాక్షి ఎంపోరియం మేనేజర్ శ్రీనివాసులు కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

రాప్తాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 8వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

బాలికలకు స్వీయ రక్షణ అవసరం

అనంతపురం ఎడ్యుకేషన్: బాలికలకు స్వీయ రక్షణ అవసరమని అనంతపురం రూరల్ ప్రాజెక్ట్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సూచించారు. నగర శివారులోని తపోవనం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలకు సోమవారం 'స్ట్రెంత్నింగ్ సెల్వ్స్' అంశంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జయశ్రీ, నీలావతి, నాగరత్న, హేమలత మాట్లాడుతూ.. బాలికలు ఆత్మరక్షణ కోసం కరాటే లాంటి విద్యను నేర్చుకోవాలన్నారు. కరాటేలో మెలకువలపై మాస్టర్ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. అత్యవసర, ఆపద సమయాల్లో తమను తాము ఎలా రక్షించుకోవాలో కళాకారుడు రాజు ఆధ్వర్యంలో ప్రదర్శించిన నాటిక ఆకట్టుకుంది. హెల్ప్‌లైన్ సురేష్, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు గంగలకుంటలో రెవెన్యూ సదస్సు

రాప్తాడు: భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మండలంలోని గంగలకుంట గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విజయకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ ప్రజలు భూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

'పేద విద్యార్థులకు అన్యాయం చేయొద్దు'



తల్లికి వందనం అమలు చేయాలని ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అనంతపురం అర్బన్: తల్లికి వందనం అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు అన్యాయం చేస్తోందని ఎస్ఎఫ్ఐ నాయకులు ధ్వజమెత్తారు. ఎన్నికల హామీలో భాగంగా 2024–25 విద్యాసంవత్సరంలో అర్హత కలిగిన విద్యార్థులకు తల్లికి వందనం ఇవ్వాలంటూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాయకులు, విద్యార్థులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి పరమేష్ మాట్లాడుతూ.. ఒక కుటుంబంలో చదువుకునే పిల్లలు ఎందరుంటే ఉంటే అందరికీ తల్లికి వందనం అమలు చేస్తామని ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత తల్లికి వందనం అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. తల్లికి వందనం వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేస్తామంటూ ప్రకటించడం చూస్తే పథకం అమలులో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనే విషయం స్పష్టమవుతోందన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరానికి పథకం అమలు చేసి అర్హులైన విద్యార్థులకు లబ్ధి చేకూర్చాలని డిమాండ్ చేశారు.

జర్నలిస్ట్ దేవప్రసాద్ మృతి బాధాకరం



దేవప్రసాద్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ దేవప్రసాద్ మృతికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సంతాపం తెలియజేశారు. సోమవారం రాత్రి అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో దేవప్రసాద్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 30 ఏళ్లుగా జర్నలిజంలో ప్రసాద్ తనదైన ముద్ర వేసుకున్నారని కొనియాడారు. సిటీ కేబుల్‌లో తన జర్నలిజం ప్రస్థానాన్ని ప్రారంభించి అనేక మీడియా సంస్థల్లో పని చేశారని గుర్తు చేసుకున్నారు. జెమినీ టీవీలో పని చేసిన తర్వాత తన పేరు ముందు జెమిని ప్రసాద్‌గా పెట్టుకున్నారని తెలిపారు. అనారోగ్యంతో ప్రసాద్ మృతి చెందడం బాధాకరమన్నారు. అనంత వెంకటరామిరెడ్డితో పాటు మేయర్ మహమ్మద్ వసీం, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ నివాళులర్పించారు.

పనుల జాప్యంపై అసంతృప్తి

అనంతపురం కార్పొరేషన్: ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆమోదించిన అంశాలను అమలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మేయర్ వసీం స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థలో మేయర్ చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. పనుల జాప్యంపై మేయర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నగరంలోని పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపామని.. వాటికి సంబంధించిన టెండర్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా రోడ్డు ప్యాచ్ వర్క్ పనులను వేగవంతం చేయాలన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్లు గుంతలయంగా మారినట్లు తెలిపారు. తక్షణం పనులను ప్రారంభించి, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రూ.రెండు కోట్లతో పీఏబీఆర్ డ్యాం నుంచి నీరు పంపిణీ చేయడానికి టెండర్లు పిలిచినా..ఇంకా ఎందుకు మోటరు కొనుగోలు చేయలేదని అధికారులను ప్రశ్నించారు. నగరంలోని పలు డివిజన్లలో లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో నగర పాలక సంస్థ ఎస్ఈ భాస్కర్‌రావు, ఈఈ షాకీర్, డీఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

మేం ఇంతే.. మారమంతే



రోడ్డు ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్న పోలీసులే యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. సోమవారం నగరంలోని సైఫుల్లా బ్రిడ్జి వద్ద సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్న పోలీస్ అధికారి ఫొటోలు సాక్షి కెమెరాకు చిక్కాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం: